స్త్రీనిధి అతివల పెన్నిధి

- మహిళా సంఘాలకు ఆర్థిక భరోసా
- ఈ ఏడాది రూ.51 కోట్లు రుణాల పంపిణీ లక్ష్యం
- యూనిట్ల స్థాపనతో స్వయం ఉపాధి
- నగదు రహితం.. పారదర్శక చర్యలు
- జిల్లాలో 13,421 మహిళా సంఘాలు
- బకాయిల రికవరీకి కార్యాచరణ







జఫర్‌గడ్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నిరుపేద అతివలకు అండగా నిలుస్తూ, స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయిస్తూ, ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. వారికి రుణ సాయాన్ని అందించి ప్రగతి పథంలో పయనించేలా స్త్రీనిధి పేరుతో రుణాలు అందిస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. చిన్న, పెద్ద తరహాలు వ్యాపారాలు చేసుకునే వారిని పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా చేయాలనే ఉద్దేశంతో స్త్రీనిధి ద్వారా ప్రత్యేక రుణాలను అందిస్తోంది. బ్యాంకు లింకేజీతో పాటు అత్యవసర వేళల్లో రుణాలు అందిస్తూ అండగా నిలుస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల్లో చేరి డబ్బులు పొదుపు చేస్తూనే స్త్రీనిధి రుణాలతో ఉపాధి దిశగా మహిళలు అడుగులు వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 13,241 స్వయం సహాయక సంఘాలు ఉండగా, 1,40,210 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రుణ లక్ష్యం ఖరారు చేసి రూ.51కోట్లు రుణం ఇవ్వాలని నిర్దేశించారు. సూక్ష్మ రుణాల వడ్డీ వ్యాపారుల బారి నుంచి రక్షించి మహిళలకు ఆర్థిక స్వాంతనగా నిలిపేందుకు 2011లో స్త్రీనిధి ప్రారంభమైంది. స్త్రీనిధిలో వ్యక్తిగతంగా, సంఘ పరంగా అవసరాన్ని బట్టి రూ.5 లక్షల వరకు రుణాలు పొందవచ్చు. రుణాల పంపిణీలో అక్రమాలకు తావులేకుండా ఆన్‌లైన్‌లో మంజూరు ప్రక్రియ ఉంటుంది.

ఎంపిక చేసుకునే యూనిట్లు

పొదుపు సంఘాల మహిళలు స్వయం ఉపాధి కోసం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆసక్తి గల వారు ఎంచుకున్న యూనిట్లను మంజూరు చేయనున్నారు. కిరాణ షాపు, నాటు కోడి పిల్లల పెంపకం, ఎలక్ట్రిక్ ఆటోలు, సౌర యూనిట్లు, గొర్రెలు, పాడి గేదెల పెంపకం, టైలరింగ్, కూరగాయల ఉత్పత్తి, బట్టల దుకాణం, ఇటుకల తయారీ, వంటి స్వయం ఉపాధి యూనిట్లకు స్త్రీనిధి కింద రుణాలు అందించనున్నారు. వ్యక్తిగత లేదా ఉమ్మడిగా రుణాలు రూ.50వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందజేస్తారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉంటేనే రుణం వస్తుంది. తీసుకున్న రుణాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుంది.

ఈ ఏడాది రూ.51 కోట్లు పంపిణీ లక్ష్యంగా

జిల్లాలో పొదుపు సంఘాల మహిళలకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.51కోట్లు రుణాలు అందించేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. ప్రస్తుతం 314 స్వయం సహాయక సంఘాలకు చెందిన 782 మంది మహిళలకు 7.92 కోట్లు (మిగతా 8లో...)


కలెక్టరేట్‌లో సంఘాల మహిళలకు రుణాల గురించి వివరిస్తున్న డీఆర్‌డీవో వసంత(ఫైల్)

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా


వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

జనగామ రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ప్రగతిపై సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిసి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఇసుక కొరత లేకుండా నిర్మాణాలకు కావలసిన ఇసుకను సూర్యాపేట నుంచి తెప్పిస్తున్నామన్నారు. జిల్లాకు కేటాయించిన 30.50లక్షల మొక్కల లక్ష్యాలను సాధించేందుకు వనమహోత్సవం చేపట్టాలన్నారు. ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో మాధురిషా, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవోలు గోపిరాం, కొమురయ్య, డీఆర్డీవో వసంత తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు పరికరాలు అందించాలి

అర్హత కలిగిన ప్రతీ ఒక్క వికలాంగుడికి పరికరాలు అందించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు పాముకుంట్ల చందు, కార్యదర్శి బిట్ల గణేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వికలాంగులకు ఉచితంగా అందించే పరికరాలలో ప్రభుత్వం అందించే గైడ్‌లైన్స్‌ను కాదని అధికారులు డ్రా పద్ధతిలో ఎంపికల చేసిన లిస్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో తహసీల్దార్ల బదిలీలు

జనగామ, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం పలు మండలాల తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. చిలుపూర్ మండల తహసీల్దార్ సరస్వతి కలెక్టర్ ఆఫీస్‌కు, జఫర్‌గఢ్ తహసీల్దార్ శంకరయ్య స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో కార్యాలయానికి, దేవరుప్పుల నాయబ్ తహసీల్దార్ బి.విజయకుమార్ చిలుపూర్ నాయబ్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. అలాగే జఫర్‌గడ్ నాయబ్ తహసీల్దార్ దేవరుప్పుల నాయబ్ తహసీల్దార్ గా, జనగామ నాయబ్ తహసీల్దార్ సీహెచ్.రజిత అదే తహసిల్ కార్యాలయంలో ఎన్నికల విభాగానికి బదిలీ అయ్యారు. చిల్పూరు నాయబ్ తహసీల్దార్ సీహెచ్.సదానందం పాలకుర్తి నాయబ్ తహసీల్దార్‌గా, జనగామ ఆర్డీవో కార్యాలయంలో పని చేస్తున్న నాయబ్ తహసీల్దార్ బి.రాజేష్‌రెడ్డి, జఫర్‌గఢ్ నాయబ్ తహసీల్దార్‌గా, పాలకుర్తి నాయబ్ తహసీల్దార్ ఆర్.వేణుకుమార్ స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ గా, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో కార్యాలయ నాయబ్ తహసీల్దార్ టి.క్రాంతికుమార్ జనగామ ఆర్డీవో నాయబ్ తహసీల్దార్ గా బదిలీ అయ్యారు.

తల్లి వైద్యం కోసం
దొంగతనాలు

- అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు
- రూ.50వేల నగదు, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం
- జనగామ ఏసీపీ పండరి చేతన్ నితిన్


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నితిన్

జనగామ రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): లారీని దొంగిలించిన అంతరాష్ట్రాల దొంగలను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు జనగామ ఏసీపీ పండరి చేతన్ నితిన్ వెల్లడించారు. జనగామ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన నంద్‌కిషోర్ సుఖ్ చంద్ ఖాత్రే అనే యువకుడు లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడని, ఖాత్రే తల్లి నోటి క్యాన్సర్‌తో బాధపడుతోందని తెలిపారు. తల్లి వైద్యం కోసం డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. జూన్ చివరి వారంలో జనగామ మండలం వడ్లకొండ సమీపంలోని నయారా పెట్రోల్ బంకు వద్ద పార్కు చేసి ఉన్న లారీని దొంగతనం చేసినట్లు ఏసీపీ వెల్లడించారు. బాధితుడు గొరిగే మహేశ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. ఖాత్రే దొంగతనం చేసిన లారీలు, ఇతర వాహనాలను సల్మాన్ మన్సూరి అనే వ్యక్తికి అమ్మేవాడన్నారు. జనగామలోని హైదరాబాద్ రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద మంగళవారం దొంగతనం చేయడానికి వచ్చిన ఖాత్రే, మన్సూరి అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.50వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించామన్నారు. వీరు అంతరాష్ట్ర వ్యాప్తంగా దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చినట్టు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చాటిన సీఐ దామోదర్ రెడ్డి, ఎస్సైలు భరత్, చెన్నకేశవులు, కానిస్టేబుళ్లను వరంగల్ సీపీ సీపీ అభినందించారని తెలిపారు.

ఎరువుల షాపులను తనిఖీ చేసిన డీఏవో

దేవరుప్పుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు మండలంలోని కడవెండి, సింగరాజుపల్లి గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి అంబిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె సేల్స్ రిజష్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎరువులను ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అడిగిన ఎరువులు మాత్రమే ఇవ్వాలని, అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, యూరియా తీసుకున్న రైతులకు లింకులు పెట్టి విక్రయించకూడదని ఆదేశించారు. పట్టా పాసుబుక్కు కలిగిన రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. దేవరుప్పులలోని రైతు వేదికలో వన మహోత్సవ కార్యక్రమం జరుగగా మండల వ్యవసాయాధికారి దివ్య మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఈఓలు సాగర్, భాస్కర్, రైతులు ధర్మారెడ్డి, గిరియాదవ్, భాస్కర్ పాల్గొన్నారు.

ఉనికి కోసమే ప్రతిపక్షాల విమర్శలు

- రేషన్ కార్డులు రాని వారు దరఖాస్తులు చేసుకోవచ్చు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూడకుండా కేవలం రాజకీయ ఉనికి కోసమే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని 1,036 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులను కడియం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త రేషన్‌కార్డు రాని వారు వెంటనే మీ సేవా ద్వారా కానీ, తహసీల్దార్ కార్యాలయంలో కానీ దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి కార్డు మంజూరు చేస్తారని తెలిపారు. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ధరంసోత్ వెంకన్న, మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్య రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, డీటీలు శ్రీనివాస్, సంధ్యారాణి, ఆర్ఐలు శ్రీకాంత్, సతీష్ పాల్గొన్నారు.

బిల్లుల మంజూరులో జాప్యం వద్దు..

ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల మంజూరులో లబ్ధిదారులకు జాప్యం జరగవద్దని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. పైలెట్ గ్రామంగా ఎంపికైన తానేధార్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం ఇంటింటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామానికి 109ఇళ్లు మంజూరి కాగా 80 మంది లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించారు. మిగితా వారు ఎందుకు ప్రారంభించలేదని కడియం ఆరా తీశారు. వెంటనే పనులు ప్రారంభించాలని లేదంటే వెనక్కి తీసుకోవడం జరుగుతుందన్నారు. త్వరలోనే కలెక్టర్ సమక్షంలో ఇందిరమ్మ ఇళ్ల విషయంలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యల పైన సమీక్ష సమావేశం నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, నాయకులు మంతెన ఇంద్రసేనా రెడ్డి, సీహెచ్ నరేందర్ రెడ్డి, బూర్ల శంకర్, దుంపల పద్మారెడ్డి, గాదె సుధాకర్, గాదె చంద్రయ్య, దుంపల సురేష్ రెడ్డి, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.


లబ్ధిదారులకు రేషన్‌కార్డును అందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

జనగామ, జూలై 22(ఆంధ్రజ్యోతి): జనగామ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా 99 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మునిసిపల్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో కలిసి మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మెన్ మేకల రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్లు పగిడిపాటి సుధ, ముస్త్యాల దయాకర్, వాంకుడోతు అనిత, పేర్ని స్వరూప, సమద్, నాయకులు ఉడ్గుల నర్సింహులు, ధర్మపురి శ్రీనివాస్, మామిడాల రాజు, జాయ శ్రీశైలం పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే చిత్రపటంతో నాయకులు

రూ.కోటి మంజూరయ్యాయనడం విడ్డూరం

- బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన నిధులు ఏమి చేశారు
- బీఆర్‌ఎస్ నాయకుడు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న పల్లా సుందర్‌రామ్‌రెడ్డి

దేవరుప్పుల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడవెండి శివారులోని వానకొండయ్య శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుట్ట అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ప్రకటించడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ నాయకుడు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మండల బీఆర్‌ఎస్ కార్యాయలంలో మండల పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలోనే రూ.2.50కోట్లు ప్రతిపాదనలు పంపగా, ఎంఆర్ఆర్ నిధులు రూ.1.60 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో రూ.70 లక్షల వరకు ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులు సంబంధిత కాంట్రాక్టర్ చేపట్టగా బిల్లు చెల్లింపులు కూడా జరిగాయన్నారు. మిగితా రూ.90లక్షలు ఏమయ్యాయో తెలుపాలన్నారు. ఆలయగోపురం నిర్మాణానికి రూ.50 లక్షలు, కల్యాణమండపం నిర్మాణానికి రూ.50లక్షలు సీఎం అదనపు నిధులు కూడా కేటాయించారన్నారు. గతంలోనే టెండరైన కొంత పనులు చేపట్టి కూడా ప్రభుత్వం ఏర్పడి కూడా 18నెలలు గడిచినా పూర్తి చేయకుండా వానకొండయ్య గుట్ట అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరీ అయ్యాయని ఎమ్మెల్యే వెల్లడించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. సమావేశంలో మండలపార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు బస్వ మల్లేశం, చింత రవి, హన్మంతు, కొల్లూరు సోమయ్య, తాటిపెల్లి మహేష్, నక్క రమేష్, గండిపెల్లి యాకయ్య, వంగ అర్జున్, జోగు సోమనర్సయ్య పాల్గొన్నారు.

బాలికపై అత్యాచార యత్నం

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

పాలకుర్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముక్కు పచ్చలారని తొమ్మిదేళ్ల బాలికపై వృద్ధుడు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం మండల పరిధిలో జరిగింది. ఎస్సై దూలం పవన్ కుమార్ కథనం ప్రకారం.. తీగారంనకు చెందిన పోగు సోమయ్య (60) ఓ గ్రామానికి చెందిన బాలికకు సోమయ్య మాయ మాటలు చెప్పి ఇంటికి పిలిపించుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అత్యాచారానికి ప్రయత్నించాడు. ప్రతిఘటించిన బాలిక అక్కడి నుంచి తప్పించుకొని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు జరిగిన దారుణాన్ని చెప్పుకుంది. ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు, స్థానికులు వృద్ధుడికి దేహశుద్ధి చేశారు.

బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి చర్యలు

- కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి జితిన్ ప్రసాద్
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నకు వివరణ ఇచ్చిన మంత్రి



హనుమకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ మంత్రి జితిన్ ప్రసాద్ లోక్‌సభలో వెల్లడించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన వివరణ ఇచ్చారు. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడం, పెట్టుబడులను ఆకర్షించడం, స్థానికులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడం లక్ష్యంగా కారిడార్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ వ్యూహాత్మక ప్రణాళికను అమలు చేయడం ద్వారా పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టుల స్థితిగతులు, అమలులో ఉన్న కార్యాచరణ ప్రణాళికల పురోగతిపై త్వరలో మరింత సమాచారం వెల్లడిస్తామన్నారు. కారిడార్ల అభివృద్ధి పారిశ్రామిక కనెక్టివిటీని మెరుగుపరచడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సమగ్ర ఆర్థిక దృక్పథానికి అనుగుణంగా సాగుతోందన్నారు. ఎంపీ కావ్య స్పందిస్తూ.. తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర సహకారం కొనసాగాలని కోరారు.

ఐసీసీసీ నుంచి వాహనాల

నియంత్రణకు చర్యలు

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) నుంచి వాహనాలను నియంత్రణకు చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం వరంగల్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ కేంద్రాన్ని గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సందర్శించారు. సీసీ కెమెరాల పనితీరుపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన జేసీబీలు, డోజర్లు, చెత్త తరలింపు ట్రాక్టర్ల కదలికలను ఐసీసీసీ కేంద్రం నుంచి మానిటరింగ్ చేసేలా ఉండాలన్నారు. పనిచేయని వాహనాల పూర్తి సమాచారం ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. ఇండోర్ తరహాలో మానిటరింగ్ వ్యవస్థ కొనసాగాలన్నారు. చెత్త తరలింపు వాహనాల సమాచారం ఎప్పటికప్పుడు జవాన్‌లు పరిశీలించాలన్నారు. స్వచ్ఛఆటోలకు బయోఫెన్సింగ్ లాగింగ్ ఉండాలన్నారు. గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులు ఐసీసీసీకి చేరేలా అనుసంధానం చేయాలన్నారు. ఫిల్టర్‌బెడ్‌లలో ఉన్న 125 సీసీ కెమెరాలను అనుసంధానం చేయాలన్నారు. సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డీసీ ప్రసన్నరాణి, ఈఈలు రవికుమార్, మాధవిలత, డీఈలు రాజ్‌కుమార్, శ్రీకాంత్, ఐటీ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

కేఎంసీలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

వరంగల్ మెడికల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కాకతీయ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు వైద్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 28లోపు కేఎంసీలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

ఎంఏ తెలుగు ప్రవేశాలకు ఇంటర్వ్యూ

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 30, 31 తేదీల్లో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 9989139136, 9989417299 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎర్త్ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా రామచంద్రం


కేయూ వీసీ నుంచి ఉత్తర్వులు తీసుకుంటున్న రామచంద్రం

కేయూ క్యాంపస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ వర్సిటీ మొట్టమొదటి ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం మంగళవారం కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి తన చాంబర్‌లో నియామక ఉత్తర్వులను అందచేసి అభినందించారు. 1991లో కేయూలో చేరిన రామచంద్రం.. కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి, డెవలప్‌మెంట్ ఆఫీసర్, రాజనీతిశాస్త్ర అధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా పనిచేశారు. అలాగే దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్‌గా, కేయూ ఎడ్యుకేషన్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గానూ పనిచేశారు. ప్రస్తుతం సైకాలజీ విభాగాధిపతిగా, కేయూ రిజిస్ట్రార్‌గా గత జనవరి 31 నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 33 ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం కల్గిన రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం నేతృత్వంలో 8 మంది డాక్టరేట్‌లు, మరో 4 గురు ఎంఫిల్ సాధించారు. 47 సదస్సులు, 34 పరిశోధన పత్రాలను ప్రచురించారు. ప్రొఫెసర్ రామచంద్రం రాజనీతిశాస్త్రం, సైకాలజీ, ఎడ్యుకేషన్ మూడు విభాగాల్లో డాక్టరేట్ పట్టా సాధించి ఘనత వహించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమితులైన ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

హత్య కేసు ఛేదించిన పోలీసులు


హత్య కేసులో నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

- పునుగుల బండి వద్ద ఇబ్బంది పెడుతున్నాడని ఘాతుకం
- నలుగురు నిందితుల అరెస్ట్

బచ్చన్నపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న అర్ధరాత్రి జనగామ జిల్లా బచ్చన్నపేటలో హత్యకు గురైన బత్తుల రాజిరెడ్డి కేసును పోలీసులు ఛేదించారు. హత్యలో పాల్గొన్న ఇద్దరితో పాటు, సహకరించిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని మంగళవారం ఏసీపీ నితిన్ చేతన్ పండరి సమక్షంలో అరెస్ట్ చూపారు. ఏసీపీ మాట్లాడుతూ మతిస్థిమితం లేని రాజిరెడ్డి, పునుగుల బండి నడుపుతున్న ఉమాసాగర్ అలియాస్ సన్నీ వద్దకు వచ్చి నిత్యం బూతులు తిడుతుండేవాడని, బండి వద్ద ఉన్న కుటుంబ సభ్యురాలిని చూస్తూ అసభ్యకరంగా మాట్లాడుతుండేవాడన్నారు. దీంతో గిరాకీకి దెబ్బ తింటుందని భావించి రాజిరెడ్డి పీడ వదిలించుకోవాలనే ఉద్దేశంతో కోరుబోతుల అరుణ్‌తో కలిసి సిమెంట్ ఇటుకలతో కొట్టి చంపారని వెల్లడించారు. వారికి కోరుబోతుల రాజు, తంగళ్లపల్లి విజయ్‌లు సహకరించారన్నారు. హత్యకు ఉపయోగించిన ఇటుకలను, రక్తం అంటిన దుస్తులను కాల్చివేయగా, వాటికి సంబంధించిన దుస్తుల ముక్కలను, దాచి ఉంచిన ప్యాంట్లు, స్కూటీ, బైక్‌ను స్వాధీనపర్చుకున్నట్టు ఏసీపీ వివరించారు. కేసును ఛేదించిన సీఐ అబ్బయ్య, ఎస్ఐ ఎస్‌కే అబ్దుల్ హమీద్, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

పెన్షన్ పెంచకుంటే సీఎం పదవి నుంచి తప్పుకోవాలి

ఎంఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

న్యాశాయంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో వికలాంగులకు, ఇతర పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే పెన్షన్ పెంచాలని, లేదంటే సీఎం పదవికి రాజీనామా చేయాలని ఎంఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్ డిమాండ్ చేశారు. న్యాశాయంపేటలోని పద్మశాలీ కమ్యూనిటీ హాల్‌లో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన మంగళవారం హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్, అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వైకే విశ్వనాథ్ హాజరై మాట్లాడుతూ.. వికలాంగులు, వితంతువులు, ఇతర పెన్షన్‌దారులకు ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి సీఎం అయ్యారని, ఇప్పటికైనా వెంటనే పెన్షన్ పెంచాలని, లేదంటే పెన్షన్‌దారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు. ఈ నెల 29న వరంగల్ లేబర్‌కాలనీ 100ఫీట్ల రోడ్‌లో ఉన్న శుభం గార్డెన్‌లో వికలాంగుల, చేయూత పెన్షన్‌దారుల సభకు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ వస్తున్నారని, ఈ సభకు పెద్ద సంఖ్యలో పెన్షన్‌దారులు హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు సందె కార్తీక్, వంగూరి ఆనందరావు, కందుకూరి సోమన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలకు రండి

- మంత్రి సురేఖకు గంగు ఉపేంద్రశర్మ ఆహ్వానం


మంత్రి సురేఖకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఉపేంద్రశర్మ తదితరులు

హనుమకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని సుప్రసిద్ధ వేయిస్తంభాల గుడిలో ఈనెల 25 నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకు జరిగే శ్రావణమాసోత్సవ పూజాకార్యక్రమాలకు రావాల్సిందిగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆహ్వానించారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని నివాసంలో మంత్రిని కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈనెల 28వ తేదీన శ్రావణ మాస తొలి సోమవారం ఆలయానికి విచ్చేసి ఆరోజు జరిగే రుద్రహోమం, మహాన్నపూజ, మహాన్నదానం కార్యక్రమాలలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి సురేఖ సానుకూలంగా స్పందించారు. తప్పకుండా వస్తానని చెప్పారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా విష్ణు, శివ, అమ్మవారి ఆలయాలు, గ్రామ దేవతల గుళ్లలో విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించినట్టు మంత్రి తెలిపారు. మంత్రి సురేఖను కలిసినవారిలో ఉపేంద్రశర్మతో పాటు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.అనిల్‌కుమార్, సిబ్బంది మధుకర్ ఉన్నారు.

'దేవాదుల' సెంట్రల్

నోడల్ అధికారిగా ఆశిష్‌సక్సేనా

హనుమకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం సెంట్రల్ నోడల్ అధికారిగా కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రెటరీ ఎస్‌హెచ్ ఆశిష్ సక్సేనా నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ పదంలాల్ నేగి స్థానంలో ఆయన నియమితులయ్యారు. సక్సేనా హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని ఈ ప్రాజెక్టు వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై), జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పరిధిలో ఉన్న దేవాదుల ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం అందుతున్న సాగునీటిని మరింత సమర్థవంతంగా ఉపయోగించేందుకు తీసుకోవలసిన చర్యలను సెంట్రల్ నోడల్ అధికారిగా సక్సెనా కేంద్రానికి సూచిస్తారు. ప్రతీ నీటిబొట్టుతో ఎక్కువ పంటను ఉత్పత్తి చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తారు. అలాగే జల్ జీవన్ మిషన్ కిందకు కూడా తీసుకువచ్చిన దేవాదుల ప్రాజెక్టు ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, ప్రాజెక్టు రైతులకు మరింత ఎక్కువ ప్రయోజనం కలిగించేట్టు చూడడం వంటి మౌలిక విధులను నిర్వర్తిస్తారు.

దేవాదుల ప్రాజెక్టు హనుమకొండ, వరంగల్, కరీంనగర్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, యాదాద్రి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల్లోని 2.48 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించడానికి ఉద్దేశించింది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.13580.63కోట్లు. ఈ ప్రాజెక్టు వాస్తవానికి 2025 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించినా 2027 మార్చి నాటికి పూర్తవుతుందని అంచనా. ప్రాజెక్టు మిగిలిపోయిన పనుల సత్వర పూర్తికి సెంట్రల్ నోడల్ ఆఫీసర్ మార్గదర్శనం చేస్తారు.


గూడూరులో అరకపట్టి దున్నుతున్న ఎస్సై లింగారెడ్డి

అరక పట్టి.. చెలక దున్ని..

సాగు పనుల్లో ఎస్సై మమేకం

పాలకుర్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణలో తలమునకలయ్యే ఆ ఎస్సై అరక పట్టి పత్తి చేనులో దున్నడం ఆసక్తిగా మారింది. జనగామ జిల్లా పాలకుర్తి మండల పోలీస్‌స్టేషన్‌లో అదనపు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మేకల లింగారెడ్డి రోజువారి విధుల్లో భాగంగా గూడూరు గ్రామానికి వెళ్లాడు. తిరిగి పాలకుర్తికి వెళ్తున్న క్రమంలో మార్గం మధ్యలో పత్తి చేనులో రైతు అరక దున్నడం చూసి తాను దున్నుతానని రైతుకు చెప్పి అరక అందుకున్నాడు. కాడెద్దులను కదిలిస్తూ వడివడిగా దున్నాడు. అలిసి పోయేదాక హలం పట్టి సాగుపై తన కున్న మమకారాన్ని చాటుకున్నాడు. అనంతనం పత్తి సాగుపై రైతుతో కాసేపు ముచ్చటించాడు. రైతుకు నమస్కరించి అక్కడి నుంచి పెట్రోలింగ్ వాహనంలో వెళ్లిపోయాడు.

తహసీల్దార్‌ను బెదిరించిన నకిలీ విలేకరుల అరెస్టు

ఇద్దరు అన్నదమ్ముల రిమాండ్


నకిలీ విలేకరుల అరెస్టు చూపిస్తున్న ఎస్సై పస్తం శ్రీనివాస్

ఐనవోలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఐనవోలు తహసీల్దార్‌ను డబ్బుల కోసం బెదిరించిన ఇద్దరు నకిలీ విలేకరులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన అన్నదమ్ములు దామెర రాజేందర్, దామెర రవీందర్‌లు జన నిర్ణయం అనే (పీడీఎఫ్) పేపర్ పెట్టారు. ఐనవోలు తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌పై మల్లన్న మండపంలో వి(అ)క్రమార్కుడు పేరిట నిబంధనలకు విరుద్ధంగా నాలా కన్వర్షన్ చేస్తున్నాడంటూ కథనం రాశారు. ఆ క్లిపింగ్‌ను తహసీల్దార్‌కు వాట్సాప్ చేసి ఫలానా సర్వే నంబర్లలో అంటూ మెసేజ్ పెట్టి రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే రోజుకు ఒకటి చొప్పున రాస్తామంటూ బెదిరించారు. అయితే మీరు పంపించిన సర్వే నంబర్లలో నాలా కన్వర్షన్ నిబంధనల మేరకే చేశానంటూ తహసీల్దార్ చెప్పినా వినలేదు. పైపెచ్చు మరికొందరితో తహసీల్దార్‌కు ఫోన్లు చేయించారు. అవినీతిలో ఘనుడు అని వార్తలు వస్తాయని చెప్పడంతో ఆందోళనకు గురైన తహసీల్దార్.. డబ్బులు ఇస్తానంటూ సోమవారం రూ.20 వేలు ఇచ్చాడు. అవి తీసుకుని ఇవి సరిపోవు.. రూ.2 లక్షలు ఇవ్వాల్సిందేనని బ్లాక్ మెయిల్ చేశారు. మంగళవారం డబ్బులు ఇస్తాను.. కార్యాలయానికి రమ్మని చెప్పగా రవీందర్ ఐనవోలు కార్యాలయానికి వచ్చాడు. మరో రూ.30వేలు నగదు ఇవ్వగా తీసుకున్నాడు. కాపుకాసిన పోలీసులు డబ్బులు తీసుకున్న ఆయనను పట్టుకొని నగదును సీజ్ చేశారు. ఇద్దరు అన్నదమ్ములపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుచగా ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. మానసిక ఆందోళనకు గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించేవిధంగా వ్యవహరించారని తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు నకిలీ విలేకరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7820	5300
మక్కలు	2355	1521
కందులు	5966	3022
పెసళ్లు	7002	3022
పల్లికాయ (సూక)	5800	3450
పల్లికాయ (పచ్చిది)	4800	1575
పసుపు (కాడి)	10299	9534
పసుపు (గోల)	10000	9700
తేజ మిర్చి	8000	8500
తేజ ఏసీ	13500	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341 ఏసీ	13000	7000
దీపిక	9000	8000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

వెల్ది మాజీ సర్పంచ్‌కు 'ముచ్చర్ల సత్తన్న' పురస్కారం

రఘునాథపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కల చేతుల మీదుగా మంగళవారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామ తాజా మాజీ సర్పంచ్ కొయ్యడ మల్లేష్‌కు 'ముచ్చర్ల సత్తన్న' పురస్కారాన్ని అందుకున్నారు. ముచ్చర్ల సత్తన్న పంచాయతీ పాటను ఆవిష్కరించడంతో పాటు రాష్ట్రంలోని ఆరుగురు మాజీ సర్పంచ్‌లకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఆర్థికంగా నష్టపోకుండా.. విజయం సాధించి నిస్వార్థంగా ప్రజా సేవ చేయాలని అన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజా సేవనే లక్ష్యంగా తనదైన శైలిలో సామాజిక సేవా కార్యక్రమాలతో గ్రామ పేరును రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లిన కొయ్యడ మల్లేష్‌కు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.


గవర్నర్ దత్తాత్రేయ, మంత్రి సీతక్క, నుంచి పురస్కారం అందుకుంటున్న మల్లేష్


కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులతో నిర్వాహకులు

రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్‌లో పతకాలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్ జిల్లా కేంద్రంలోని బల్బీర్‌సింగ్ జునేజా స్టేడియంలో ఈ నెల 16నుంచి 20వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్‌ల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పలు పతకాలను కొల్లగొట్టారు. పత్తి వెంకటసాయి 70కిలోల లోకిక్ విభాగంలో ప్రతిభ కనబర్చి కాంస్యం, 45కిలోల కిక్‌లైట్, కిక్ కాంటాక్ట్ విభాగాల్లో జాడి మాధవి, కొమ్ము భవ్యశ్రీలు ప్రత్యర్థులపై విజయ దుందుభి మోగించి కాంస్య పతకాలను సాధించారని తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిగిరి తిరుపతి తెలిపారు. విశ్వ విద్యాలయం నుంచి నలుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొనగా, ఇందులో ముగ్గురు విద్యార్థులు కాంస్య పతకాలు సాధించి కళాశాలకు కీర్తి ప్రతిష్టలను తీసుకువచ్చారన్నారు. ఈ మేరకు పలు విభాగాల్లో కాంస్య పతకాలు సాధించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులను మంగళవారం తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, కోశాధికారి పి.శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు తదితరులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కుకై సమావేశానికి హాజరైన రామస్వామి


ఢిల్లీలోని నోయిడాలో జరిగిన సమావేశంలో పాల్గొన్న రామస్వామి

నర్సంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని నోయిడాలో ఈ నెల 19న జరిగిన 'కుకై' అసోసియేషన్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నర్సంపేటకు చెందిన పర్యావరణవేత్త, కళాకారుడు గోకా రామస్వామి పాల్గొన్నారు. ఆ సమావేశంలో నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గోకా రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో జరిగిన చర్చల్లో కుకై (సీయూసీఐఏ) అసోసియేషన్ పేరును యునెస్కో అసోసియేషన్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారని రామస్వామి తెలిపారు. అసోసియేషన్ ద్వారా భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలపై చర్చించారన్నారు. కార్యక్రమంలో నేషనల్ జనరల్‌సె సెక్రటరీ యోగేష్ కులశ్రేష్ఠ, ఆగ్రాకు చెందిన అసోసియేషన్ కోశాధికారి రాజేశ్ కులశ్రేష్ఠ, రాజస్థాన్‌కు చెందిన గోపాల్‌లాల్, పంజాబ్‌కు చెందిన సుమన్‌శర్మ, చత్తీస్‌గఢ్‌కు చెందిన మహీబా, మధ్యప్రదేశ్‌కు చెందిన ఫిరోజ్‌ఖాన్, తెలంగాణకు చెందిన రాజగోవింద్ పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

రోల్డ్‌గోల్డ్ నగలు, నకిలీ పత్రాలపై రుణాలు

- ఆ తర్వాత తప్పించుకుంటున్న బ్యాంకు అధికారులు
- ఆర్‌బీఐకి వినియోగదారుల మండలి ఫిర్యాదు

హనుమకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో రోల్డ్‌గోల్డ్ నగల తాకట్టు, నకిలీ పాసు పుస్తకాల వ్యవహారాలకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద వివరాలు ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరించడంపై వినియోగదారుల మండలి చెన్నైలోని భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ)కు ఫిర్యాదు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో రోల్డ్‌గోల్డ్ నగలు, నకిలీ ఆస్తిపత్రాలు, నకిలీ పాస్ బుక్కుల తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంటున్న సంఘటనలు అనేకం జరుగుతున్న నేపథ్యంలో వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచెర్ల సుదర్శన్‌లు ఈ ఫిర్యాదు దాఖలు చేశారు. బ్యాంకులో తాకట్టుకు వచ్చిన బంగారం, ఆస్తి పత్రాలు ఒరిజినలేనని ధ్రువీకరించుకొని రుణాలు మంజూరు చేస్తున్న అధికారులు.. ఆ తర్వాత కొంతకాలానికి బంగారం రోల్డ్ గోల్డ్ అని, పాస్ పుస్తకాలు నకిలీ అని ప్రకటిస్తున్నారని తమ ఫిర్యాదులో ఆర్‌బీఐ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ నేపథ్యంలో తాకట్టు సమయంలో పాల్గొన్న బ్యాంకు సిబ్బంది, తాకట్టు అగ్రిమెంట్‌లపై సంతకాలు, మొండి బకాయిల వివరాల సమాచారం ఆర్‌టీఐ కింద అడిగితే ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. బ్యాంకులు సమాచార హక్కు చట్టం పరిధిలోకి రావని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం బ్యాంకుల్లో తాకట్టు వ్యవహారాల సమాచారం ఇవ్వకూడనిది కాదని, అలాగే బ్యాంకుల్లో జరుగుతున్న వ్యవహారాలు ఎప్పటికప్పుడు అధికారులు స్వచ్ఛందంగా బహిర్గతం చేయాలని చక్రపాణి, మొగిలిచెర్ల సుదర్శన్ తన ఫిర్యాదులో కోరారు. బ్యాంకుల్లో డబ్బు ప్రజలదని, నకిలీ బంగారం, పత్రాల పేరుతో కోల్పోతే నష్టపోయేది ప్రజలే (వినియోగదారులు)నని పేర్కొన్నారు. కనుక బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సమాచారం ఇచ్చేలా బ్యాంకులకు ఆర్‌బీఐ తగిన ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు.

నేడు రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

రఘునాథపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి రిజర్వాయర్ కుడి ప్రధాన కాల్వ నుంచి సాగునీటిని చీటకోడూరు రిజర్వాయర్‌కు వెళ్లే కాల్వకు బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి విడుదల చేయనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ మంగళవారం తెలిపారు. రవి మాట్లాడుతూ కాల్వ ద్వారా వచ్చే సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

క్రేజీ.. జియాలజీ


పీజీ కోర్సు పూర్తి చేసినవారికి ఉజ్వల భవిష్యత్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విస్తృత ఉద్యోగావకాశాలు
- కేయూలో అడ్మిషన్లకు పెరుగుతున్న డిమాండ్
- ఈ యేడాది నుంచి ప్రవేశాలకు అర్హతల సడలింపు

కేయూ క్యాంపస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సైన్స్ విభాగంలో విభిన్నమైన కోర్సు భూగర్భ (జియాలజీ)శాస్త్రం. దీనికి ఏటా డిమాండ్ పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విరివిగా ఉద్యోగ అవకాశాలు లభిస్తుండటంతో యువత ఎంఎస్సీ జియాలజీ కోర్సు పట్ల ఆసక్తి చూపుతున్నారు. కేయూలో 1989లో 12 సీట్లతో ఈ కోర్సును ప్రారంభించారు. విద్యార్థుల డిమాండ్ దృష్ట్యా ప్రస్తుతం 40 సీట్లకు పెంచారు. యేటా ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు కేయూ జియాలజీ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నాయి. విదేశీ సంస్థలు సంస్థలు సైతం జియాలజీ విద్యార్థులను భారీ ప్యాకేజీలతో ఎగరేసుకుపోతున్నాయి.

జియాలజీ విభిన్నం..

సైన్స్ కోర్సులన్నింటిలో జియాలజీ కోర్సు విభిన్నం. భూమి పుట్టుక నుంచి ఉపరితలంపై నిత్యం చోటు చేసుకునే అంశాలను ఈ కోర్సు అధ్యయనం చేస్తుంది. భూమార్పులకు కారణాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తుంది. భూమిలో ఉండే పెట్రోల్, గ్యాస్‌తో పాటు బంగారం, రత్నాలు, వజ్రాలు, బొగ్గు ఖనిజాలను పసిగడుతుంది. అంతేగాకుండా సునామీ, భూకంపాలు, అగ్ని పర్వతాల పేలుడు లాంటి ప్రకృతి వైపరీత్యాలను అధ్యయనం చేస్తుంది. సాఫ్ట్‌వేర్ రంగంలోనూ జియాలజీ విభాగాలు తోడ్పడుతున్నాయి.



కేయూలో ఎంఎస్సీ జియాలజీ విభాగం

జియాలజీ చదివితే ఉద్యోగం గ్యారంటీ..



రోజురోజుకూ జియాలజీ కోర్సుకు విస్తృతి పెరుగుతోంది. జియాలజీ కోర్సులు చదివితే ఉద్యోగం గ్యారంటీ అని చెప్పవచ్చు. సబ్జెక్టులో అత్యుత్తమ ప్రతిభ కల్గిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఈ దఫా నుంచి ఏదైనా సైన్స్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వారందరూ ఎంఎస్సీ జియాలజీ కోర్సులో అడ్మిషన్లు పొందవచ్చు. కేయూ క్యాంపస్‌లో 40 సీట్లున్నాయి. క్యాంపస్‌లో హాస్టల్ వసతి ఉంది. అడ్మిషన్లపై విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే నేరుగా కేయూ జియాలజీ విభాగాన్ని సంప్రదించవచ్చు.

- ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి
విభాగాధిపతి, జియాలజీ

కేయూ జియాలజీ విభాగం ప్రత్యేకతలు

కేయూ క్యాంపస్‌లో జియాలజీ విభాగం ఉంది. వివిధ ఖనిజాలు, శిలల సముదాయాలతో కూడిన మ్యూజియం నెలకొల్పారు. జీఐఎస్, రిమోట్ సెన్సింగ్ ల్యాబ్, భూగర్భ జలాన్వేషణకు అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానం అందిస్తోంది. జియాలజికల్ సర్వే ఎక్విప్‌మెంట్, అత్యాధునిక రీసెర్చ్ మైక్రోస్కోప్ ల్యాబ్, పెట్రాజికల్, జియో కెమికల్ మోడలింగ్, సాఫ్ట్‌వేర్, భూగర్భ జల నాణ్యత పరీక్షల ల్యాబ్, ఈ-క్లాస్‌రూమ్ బోధన, లైబ్రరీని ఏర్పాటు చేశారు. యేటా జియాలజీ విభాగం విద్యార్థులకు ఫీల్డ్ వర్క్స్, గనుల చమురు క్షేత్రాల సందర్శన, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో పాటు అత్యుత్తమ అర్హతలు కల్గిన ప్రొఫెసర్లతో బోధన అందిస్తున్నారు.

కోర్సు ప్రవేశానికి అర్హతలివే..

ఎంఎస్సీ జియాలజీ కోర్సులో అడ్మిషన్లకు ఏదైనా సైన్స్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు నిర్వహించే సీపీజీఈటీ-2025 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. సీపీజీఈటీ-2025కి రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు https://cpget.tgche.ac.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఉద్యోగ అవకాశాలు

జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు, నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, ఆయిల్ అండ్ న్యాచురల్ గ్యాస్ కార్పొరేషన్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, అటామిక్ మినరల్ డివిజన్, మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, కోల్ ఇండియా లిమిటెడ్, నేషనల్ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్, నేషనల్ హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ కార్పొరేషన్‌లో విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉద్యోగాలు

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, రాష్ట్ర భూగర్భ జల శాఖ, డిస్ట్రిక్టు రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్‌లోనూ ఉద్యోగ అవకాశాలున్నాయి. వీటితో పాటు ప్రైవేట్ సంస్థల్లోనూ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో జీఐఎస్ అనలిస్ట్, మల్టీ నేషనల్ మైనింగ్ కంపెనీలు, పర్యావరణ వేత్తలు, భూగర్భజల అన్వేషణ కంపెనీలు, సిమెంట్ పరిశ్రమలు, జాతీయ ఖనిజ అన్వేషణ సంస్థల్లోనూ ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

మేడారంలో కేశఖండనకు రుసుము పెంపు



తాడ్వాయి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థానంలో భక్తుల కేశఖండనకు రుసుము పెంచినట్టు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీర స్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రూ. 10 ఉండగా, ఇప్పుడు రుసుము రూ. 50గా నిర్ణయించినట్టు తెలిపారు. దీనిపై అభ్యంతరాలేమైనా ఉంటే 15 రోజుల్లోగా తమకు తెలపాలని పేర్కొన్నారు.

• తుమ్మచెట్టుపై మర్రి మొక్క!



తుమ్మ చెట్టు కొమ్మపై మర్రి మొక్క పెరగడం ఆసక్తికరంగా మారింది. కేసముద్రం మండలం ఉప్పరపల్లి చెరువు కట్టపైనున్న ఓ తుమ్మ చెట్టుపై మర్రి మొక్క పెరుగుతోంది. పక్షులు మర్రిపండ్లను తీసుకువచ్చి తుమ్మచెట్టుపై తినడంవల్ల గింజలు పడి మర్రిమొక్క ఉద్భవించిందని పలువురు చెబుతున్నారు. అయితే పూర్తిగా చెట్టుపైనే ఆధారపడుతూ మర్రిచెట్టు పెరగడమే ఇక్కడ వింతగా కనిపిస్తోంది. మర్రిచెట్టు పెరిగేందుకు అవసరమైన పోషకాలన్నీ తుమ్మచెట్టు నుంచే అందుతుండడం గమనార్హం. స్వయం పోషకాలుగా పిలవబడే మొక్క భిన్నంగా తన ఎదుగుదలకు మరో చెట్టుపై ఆధారపడి పరాన్నజీవిగా వ్యవహరించడం గమనార్హం.

- కేసముద్రం (ఆంధ్రజ్యోతి)

• తల్లడిల్లిన తల్లి కోడి



ఏ జీవి అయినా తన బిడ్డకు ఏమైనా జరిగితే తట్టుకోలేదు. ఆ బిడ్డ చనిపోయిందని తెలియక పిల్లను లేపడానికి తల్లి ప్రయత్నం చేస్తుంటుంది. ఇదే తరహాలో ఇనుగుర్తి మండల కేంద్రంలోని బోయినివాడ వీధిలో మంగళవారం ఉదయం ఓ వీధిలో కోడిపిల్ల చనిపోగా దాన్ని లేపేందుకు తల్లికోడి ప్రయత్నించి, దాదాపు మూడు గంటలపాటు అక్కడే తిరుగుతుండడం పలువురిని చలింపజేసింది. ఏ జాతి అయినా పిల్లల విషయంలో తల్లి ప్రేమ ఒకటేనని ఈ దృశ్యం నిరూపిస్తోంది.

- ఇనుగుర్తి (ఆంధ్రజ్యోతి)

మహిళలకు చదువుచెపుతున్న వాలంటరీ టీచర(పాతచిత్రం)



'ఉల్లాస్'ంగా.. ఉద్యోగావకాశం

- అతివల అక్షరాస్యతకు సదావకాశం
- మహిళా సంఘాల్లోని సభ్యులపై ప్రత్యేక దృష్టి
- చదువుకున్న వారిని టీచర్లుగా ఎంపిక
- ఈ ఏడాది నుంచి రాష్ట్రంలో అమలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే నవభారత్ సాక్షరత కార్యక్రమం ఈ యేడు నుంచి రాష్ట్రంలో అమలు చేసి మహిళా అక్షరాస్యతపై దృష్టి సారించనున్నారు. డ్వాక్రా గ్రూపుల్లో చదువుకోని మహిళలను గుర్తించి వారు చదువుకునే విధంగా ప్రోత్సహించేందుకు ఈ ఉల్లాస్ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టనున్నాయి. వీరు చదువుకునేందుకు వలంటీర్లనువినియోగిస్తారు. గ్రామీణపేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సహకారంతో వీవోఏలు, స్వయం సహాయక బృందాలు, మహిళా సంఘాలు ఉన్నాయి. ఈ బృందాల్లో చదువుకున్న మహిళలను గుర్తించి వలంటీరు టీచర్లుగా ఎంపిక చేస్తారు. ఒక్కొక్కరు 10మంది అక్షరాస్యులుగా చేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు వలంటీర్లుగా చేయవచ్చు. అనంతరం తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్)నుంచి 10వ తరగతి చదువుకునేలా ప్రోత్సహిస్తారు. గతంలో సాక్షారభారత్ కార్యక్రమం 2017తో ముగిసింది. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రభుత్వాలు అక్షరాస్యతను పెంచే కార్యక్రమాలు చేయలేదు.

నిర్వహణ కమిటీ

గ్రామస్థాయిలో పథకం వేగవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ 16ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అందులో డీఆర్‌డీఓతోపాటు విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారు. మండలస్థాయిలో ఎంపీడీఓ, ఎంఈఓ, ఐకేపీ ఏపీఎం, గ్రామస్థాయిలో ఉపాధ్యాయుడు, పీఓ ఏఅధ్యక్షురాలు, కార్యదర్శి బాధ్యతలు చూసుకుంటారు.

ఊతం ఇవ్వనున్న ఈ-డిజిటల్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఉల్లాస్(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) యాప్ ఎట్టకేలకు ప్రజల ముందుకు వచ్చింది. అక్షరాస్యత కార్యక్రమాలకు ఈ-డిజిటల్ ఊతం ఇవ్వనుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా చొరవలో భాగంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది పెనుమార్పులకు నాంది పలకనుంది. 2027 వరకు ఈ ఉల్లాస్ కార్యక్రమం కొనసాగనుంది.

16 అధ్యాయాల పుస్తకాలు ఉంటాయి

- తెలుగులో చదవడం, రాయడం.
- అంకెలు గుర్తించడం, కూడికలు, తీసివేతలు.
- ఆదాయం పెంచుకునేలా సూచనలు.
- పోషకాహార లోపం, అనారోగ్యాలు.
- అమ్మకు బ్యాంకు ఖాతా.
- ఇరుగు పొరుగుతో మాటామంతీ
- నైపుణ్యాల అభివృద్ధి అంశాలు.
- నిత్యజీవితంలో అవసరమయ్యే ఇతరాలు ఉంటాయి.

ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం..



జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యం చేరేలా కార్యాచరణ రూపొందిస్తాం. దానికి అనుగుణంగా నిరక్షరాస్యులకు చదువు చెప్పేలా ప్రణాళిక చేస్తాం. విద్యాశాఖ డీఆర్‌డీఓ సంయుక్తంగా పనిచేసి లక్ష్యాన్ని చేరుకుని జిల్లాలో మహిళల అక్షరాస్యత పెంచేందుకు కృషి చేస్తాం.

- మేన శ్రీను, హనుమకొండ జిల్లా డీఆర్‌డీఓ

సీఎం ఇన్‌స్టాలో 'కాటారం వరినాట్లు'




రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇన్‌స్టాగ్రామ్ అఫీషియల్ పేజీలో కాటారం మండలంలో చేపడుతున్న వానాకాలం వరినాట్లు వార్త పెట్టు కోవడం విశేషం. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'వానాకాలం వరి నాట్లు షురూ' శీర్షికన ప్రచురితమైన కథనం ఇన్‌స్టాగ్రామ్‌లో 'రేవంత్ అఫీషియల్' పేరిట ఉన్న గ్రూపులో చోటు చేసుకుంది. రేవంత్ అఫీషియల్ గ్రూపును ఫాలో అవుతున్న పలువురు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాట్లు వేస్తున్న పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం చేయడంతో ఇలా సీఎం ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పెట్టుకున్నట్లు అభిప్రాయపడుతున్నారు.

- కాటారం (ఆంధ్రజ్యోతి)

'శ్రీరామా.. నీ దయ చూపు'

- 77 రామదాసు సంకీర్తనలు ఆంగ్లానువాదం
- పుస్తకంగా ప్రచురించిన ఆథర్స్ ప్రెస్
- ప్రొఫెసర్ రాజగోపాలాచారి రచనాశైలి



ఆచార్య రాజగోపాలాచారి రామదాసు సంకీర్తనల అంగ్లానువాదం షౌయర్ యువర్ మెర్సీ, ఓ శ్రీరామా! పుస్తకం

హనుమకొండ, జులై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ భక్తుడు రామదాసు (కంచెర్ల గోపన్న) రచించిన 77 సంకీర్తనలను కాకతీయ విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖ విశ్రాంతాచార్యుడు మాడభూషణం రాజగోపాలాచారి ఇటీవల అంగ్లంలోకి అనువదించారు. షవర్ యువర్ మెర్సీ, ఓ శ్రీ రామా! అనే శీర్షికతో ఈ పుస్తకాన్ని న్యూఢిల్లీలోని ఆథర్స్ ప్రెస్ పుస్తకంగా ప్రచురించింది. రాజగోపాలాచారి 208 అన్నమయ్య కీర్తనల ఆంగ్లానువాదాన్ని కూడా ఈ ప్రెస్ గతంలో ముద్రించింది. పురాతన సాహిత్యానువాదంలో భాషాపరంగా ఉన్న ఇబ్బందులను సమర్థంగా ఎదుర్కొంటూ, మూలరచన దెబ్బతినకుండా రామదాసు కీర్తనలను అందంగా అనువదించారు. భక్తిసాహిత్యం పట్ల ఆచార్య రాజగోపాచారి మొక్కవోని నిబద్ధతను ఈ గ్రంథం తెలుపుతుంది. ఆచార్య ఈ పుస్తకంలో శ్రీ రామదాసు 77సంకీర్తనలను అంగ్ల అనువాదంతో పాటు తెలుగు మూలాన్ని కూడా సమకూర్చారు. వీటితో పాటు ప్రతీ సంకీర్తనకు కఠిన పదాల అర్థాలు, సుబోధకమైన అంగ్ల వ్యాఖ్యానం ఇవ్వడం ఇందులో విశేషం. ఆంగ్లం రాని తెలుగు పాఠకులకు కూడా ఇదొక రామదాసు సంకీర్తనల సంకలనంగా చదువుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. గ్లోసరిలో కఠిన పదాలకు ఆంగ్లంతో పాటు తెలుగులో కూడా అర్థాలు ఇవ్వడం వల్ల సంకీర్తనలను అర్థం చేసుకోవడం సులభమైంది. రచయిత ఈ సంకీర్తనలను నాలుగు విభాగాలుగా విభజించడం ఇందులో ప్రత్యేకత. గ్లోరీ ఆఫ్ లార్డ్ శ్రీ రామా అనే మొదటి విభాగంలో మొత్తం 23 సంకీర్తనలు చేర్చారు. ఈ విభాగంలోనే 11 సంకీర్తనలను నామ సంకీర్తన అన్న ఉపవిభాగంలో చేర్చారు. మూడో విభాగపు 18 కీర్తనలలో శ్రీమద్రామానుజుల విశిష్టాద్వైత సిద్ధాంత ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 'ఎన్‌కౌంటర్ విత్ తానీషా' అన్న చివరి విభాగంలో 'వినరయ్య తానీషాగారు మా మనవి..' అంటూ తన మనవిని రామదాసు విన్నవించిన తీరును ఆంగ్లంలో ఆకట్టుకునే రీతిలో అనువదించారు.

పలు ఆంగ్లానువాదాలు

ఆచార్య రాజగోపాలాచార్య ఇంతకు ముందు పలు ఆంగ్లానువాదాలు చేశారు. అన్నమయ్య కీర్తనలను 'హై ఇన్‌ది స్కై-అట్ విష్ణుపాద! అన్నమాచార్య సంకీర్తనాస్' పేరుతో చేసిన ఆంగ్లానువాదం ఇందులో ఒకటి. తిరుమల తిరుపతి వైభవంపై 'ఎటర్నల్ గ్లోరీ ఆఫ్ తిరుమల తిరుపతి షైన్ (టీటీడీ-2024)' పేరుతో పుస్తకాన్ని ఆంగ్లంలో రచించారు. తెలంగాణ సాయుధ పోరాటంపై 'తెలంగాణ ఆర్మ్‌డ్ స్ట్రగుల్ - 1948' పేరుతో ఆంగ్లంలో రాసిన మరో పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. డైవర్సిటీ ఇన్ ఇండియన్ లిటరేచర్ ఇన్ ఇంగ్లీష్ రీసెంట్ రిఫ్లెక్షన్స్ (2019), భక్తి మూమెంట్ అండ్ లిటరేచర్ (2016), పోస్ట్ కలోనియల్ ఇండియన్ ఇంగ్లీష్ ఫిక్షన్: డిసెంటరింగ్ ది నేషన్ (2016), మల్టీకల్చరలిజం ఇన్ ఇండియన్ ట్రెడిషన్ అండ్ లిటరేచర్ (2016) వంటి పలు పుస్తకాలు ఆచార్య సంపాదకత్వంలో వెలువడ్డాయి. ఆచార్య రాజగోపాలాచార్య 2021 నుంచి 2023 వరకు సప్తగిరి (ఇంగ్లీష్) సంపాదక మండలిలో సభ్యుడిగా కూడా ఉన్నారు. శ్రీ వెంకటేశ్వరుడి మహిమలు, తిరుమల వైభవంపై ఇందులో అనేక వ్యాసాలు రాశారు.

సంకీర్తనా సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలనే..



భక్తిసాహిత్యంలో తనదైనశైలిలో సంకీర్తనలను రచించి విశిష్ట స్థానాన్ని పొందిన కంచెర్ల గోపన్న (1620-1688) భద్రాచల దేవాలయం నిర్మాణం చేసి శ్రీ రామదాసుగా ప్రసిద్ధి చెందాడు. తెలుగు రాష్ట్రాల్లోనే కాక పొరుగు రాష్ట్రాల్లో కూడా ఆయన కీర్తనలు సంకీర్తనా గోష్ఠులలో, భజనలలో ముఖ్య భూమికను సంతరించుకున్నాయి. 'దాశరథీ కరుణాపయోనిధీ' అనే మకుటంతో ఆయన రచించిన దాశరథి శతకంలో కనీసం ఒక్క పద్యం రాని తెలుగువాడు ఉండడంటే అతిశయోక్తి కాదు. 'పలుకే బంగారమాయెనా కోదండపాణి..' వంటి కీర్తనలు ప్రజలలో బహుళ ప్రాచుర్యం పొందాయి. సంకీర్తనా సాహిత్య ఔన్నత్యాన్ని తెలుగు రాష్ట్రాల పరిధిదాటి ఇతర రాష్ట్రాల, దేశాల పాఠకులకు పరిచయం చేసే బృహత్తర ప్రయత్నంలో భాగంగా రామదాసు కీర్తనలను ఆంగ్లానువాదం చేశాను.

- ఆచార్య రాజగోపాలాచారి, హనుమకొండ


గూడూరులో మాట్లాడుతున్న చందూనాయక్

రైతు వ్యతిరేక చట్టాలపై పోరాడాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి చందూనాయక్

పాలకుర్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలపై ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భూక్య చందూనాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం గూడూరులో రైతాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, మన కర్తవ్యం అంశంపై మండల సదస్సు జరిగింది. చందూనాయక్ మాట్లాడుతూ ప్రధాని మోదీ అధికారంలోకి రాగానే స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, గిట్టుబాటు ధరల గ్యారంటీ చట్టం తీసుకువస్తామని దేశంలోని రైతులను మోసం చేసిందన్నారు. దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను రప్పించి చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, బచ్చు శ్రీలత, నాయిని శ్రీనివాస్, నక్క రవి, గడ్డి బుచ్చయ్య, మామిడాల సోమయ్య, బెల్లి రమేష్ ఉన్నారు.

బాక్సింగ్ సబ్‌జూనియర్స్‌లో ప్రతిభ


అనిల్, శ్రీమన్నారాయణ

బచ్చన్నపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జనగామ మినీ స్టేడియంలో మంగళవారం జరిగిన సబ్ జూనియర్స్ (అండర్-14) బాక్సింగ్ పోటీల్లో మండలంలోని కేశిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సీహెచ్ అనిల్, 9వ తరగతి విద్యార్థి సీహెచ్ శ్రీమన్నారాయణలు ఎంపికైన వారిలో ఉన్నారు. వీరిది బోనకొల్లూరు గ్రామం కాగా, కేశిరెడ్డిపల్లి పాఠశాలలో చదువుతున్నారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో హైదరాబాద్ షేక్‌పేట్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. పీఈటీ ముజీబ్‌ను హెచ్‌ఎం సుధాకర్ వారిని అభినందించారు.

మాజీ సీఎం అచ్యుతానందన్‌కు నివాళి


జనగామలో అచ్యుతానందన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

జనగామ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం, సీపీఎం మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అచ్యుతానందన్‌కు మంగళవారం నివాళులర్పించారు. సీపీఎం జిల్లా పార్టీ కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పించి సంతాప సభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ విధానాలకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజల పక్షన పోరాడిన యోధుడు అచ్యుతానందన్ అని కొనియాడారు. కార్యక్రమంలో జోగు ప్రకాశ్, బోడ నరేందర్, గంగరబోయిన మల్లేశ్ పాల్గొన్నారు.

● రఘునాథపల్లి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పించారు.కార్యక్రమంలో మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, కడారి ఐలయ్య, మైలారం వెంకటేశ్వర్లు, పొదల లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


తానేధార్‌పల్లి అంగన్‌వాడీని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

బచ్చన్నపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-7ను మంగళవారం ఎంపీడీవో మల్లికార్జున్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వర్షాకాలం కావటంతో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. నాణ్యత కలిగిన ఆహారాన్ని అందివ్వాలన్నారు. గది చుట్టూ పరిశుభ్రం గా ఉండేలా చూసుకోవాల న్నారు. జీపీ ఈవో అనిల్‌రాజ్ ఉన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు విధిగా పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో విజయశ్రీ తెలిపారు. తానేధార్‌పల్లిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో వంటలు, రిజిస్టర్‌లను, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో నర్సింగరావు, సెక్రటరీ వెంకటరమణ పాల్గొన్నారు.

మధుసూదన్‌రెడ్డి మృతి తీరని లోటు: పల్లా

జనగామ రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి మృతి తెలంగాణవాదులకు తీరని లోటని మంగళవారం ఒక ప్రకటనలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజనీతిశాస్త్రం ఆచార్యులుగా ఉండి అనేక యూనివర్సిటీ పదవులను సమర్థవంతంగా నిర్వహించి విద్యార్థుల శ్రేయస్సు కొరకు పాటుపడుతూ తెలంగాణ భావజాల వ్యాప్తి కొరకు తపనపడ్డారన్నారు. మేధావర్గాన్ని ఏకం చేయడంలో మధుసూదన్‌రెడ్డి క్రియాశీలపాత్ర పోషించారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతున్నట్టు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ


అభివాదం చేస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

జనగామ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో నిర్వహించే దశల వారీ పోరాటాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం జనగామలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సన్నాహక సమావేశంలో యూఎస్‌పీసీ జిల్లా నాయకులు చంద్రశేఖర్‌రావు, నల్లనాగుల రాజు, ఇప్ప రాంరెడ్డి, సత్తయ్య మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, జీవో నం.25ను సవరించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకులు డి.శ్రీనివాస్ మాట్లాడుతూ పోరాటంలో భాగంగా 23, 24న తహసీల్దార్ల ద్వారా సీఎంకు వినతిపత్రం ఇవ్వడం, ఆగస్టు 1న కలెక్టరేట్ వద్ద ధర్నా, 23న చలో హైద్రాబాద్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మడూరి వెంకటేష్, శ్రీనివాసరావు, శాడ రవి, చొక్కయ్య, తాటోజు శ్రీనివాసులు, అఫ్సర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

బండ్ల బాటను పునరుద్ధరించాలి


బండ్లబాటను దున్నిన ప్రదేశాన్ని చూపుతున్న రమేష్ దంపతులు

చిలుపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పొలాలకు వెళ్లే బండ్లబాటను పునరుద్ధరించి న్యాయం చేయాలని పల్లగుట్టకు చెందిన కన్నెబోయిన రమేష్ దంపతులు అధికారులను వేడుకున్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గంలో తమ పూర్వీకుల నుంచే పానాదిబాట (బండ్లబాట) ఉందని, ఇటీవల ఓ రైతు దాన్ని అతని భూమిలో కలుపుకుని బలవంతంగా సేద్యం చేసుకుంటున్నాడన్నారు.

మోడల్ హౌస్ పూర్తయ్యేనా?


నర్మెటలో బేస్‌మెంట్ దశలోనే ఉన్న ఇందిరమ్మ మోడల్ హౌస్

నర్మెట, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతున్నాయి. ఇండ్లను ఒకే నమూనాలో ఉండాలనే ఉద్దేశంతో లబ్ధిదారులకు రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం ఎలా చేపట్టాలో వారికి అవగాహన కల్పించేందుకు ప్రతీ మండలకేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగానే నర్మెట మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టారు. 45రోజుల్లో పూర్తి చేయాల్సి ఉన్నా, నెలలు గడుస్తున్నా పూర్తి కాకపోవడంపై లబ్ధదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారులకు అవగాహన ఎలా

మోడల్ హౌస్ పూర్తయితే అదే రీతిలో నిర్మించుకోవాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించే అవకాశం ఉండేది. హౌస్ నిర్మాణ పనులే పూర్తికాకపోవడంతో లబ్ధిదారులకు ఎలా అవగాహన కల్పిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయనే విమర్శిస్తున్నారు.

నాణ్యత లోపంతో నిర్మాణం

ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి నాణ్యత లేని సామగ్రిని వినియోగిస్తున్నట్లు పలువురు విమర్శిస్తున్నారు. సిమెంట్ ఇటుక నాణ్యత లేకుండా ఉంది. ఇసుక సిమెంట్‌ను సరైన విధంగా ఉపయోగించడం లేదు. మోడల్ హౌస్ నిర్మాణమే ఇంత పట్టింపు లేకుండా నిర్మిస్తే ఎలా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. కాగా, గతం కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే తక్కువ ఖర్చుతో ఇందిరమ్మ ప్రదర్శన గృహాన్ని ఎంపీడీవో కార్యాలయంలోనే నిర్మించారు. అది ప్రస్తుతం వినియోగంలో లేకుండా పోవడంతో శిథిలమైపోతున్నది. గృహం చుట్టూ పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉంది. ఈ గృహం వైపు హౌసింగ్ అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

గొర్రెల, మేకల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలి


లింగాలఘణపురంలో వినతిపత్రం అందజేస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారులు

జనగామ రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గొర్రెల, మేకల పెంపకదారుల సమస్యలను పరిష్కరించాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా అధ్యక్షుడు మోటే దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి అనంతరం తహసీల్దార్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. దేవేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం రెండు ఏళ్ల నుంచి గొర్రెల, మేకలకు నట్టల నివారణ, చిటుక రోగం మందులు, వాక్సిన్లు, పాడి పశువులకు కావల్సిన ఏద గోళీలను పంపిణీ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో గాజుల నరేశ్, బాలరాజు, చంద్రయ్య, మోటే నరేందర్ పాల్గొన్నారు.

● లింగాలఘణపురం(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఉచితంగా నట్టల నివారణ మందులను అందజేయాలని కోరుతూ మంగళవారం లింగాలఘణపురం తహసీల్దార్ రవీందర్‌కు గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. జీఎంపీఎస్ మండల అధ్యక్షుడు కర్రె కృష్ణ మాట్లాడుతూ రెండేళ్ల పశువైద్యాశాలలో నట్టల నివారణ మందులతో పాటుగా ఇతర సీజనల్ వ్యాధుల నివారణ టీకాలను అందుబాటులో ఉంచడం లేదని ఆవేదన వ్యక్త ం చేశారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు మొటికె తిరుపతయ్య, గాదరి నాగయ్య, దయ్యాల మల్లేశం, బండ వీరస్వామి, గవ్వల భిక్షపతి, నోముల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

జనగామ కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం చివరి మంగళవారం పురస్కరించుకొని రేణుక అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. జనగామలోని బాలాజీనగర్ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అర్చకుడు మారుపాక శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి పలు రకాల పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేజీబీవీని పరిశీలించిన తహసీల్దార్

లింగాలఘణపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడెం కేజీబీవీని తహసీల్దార్ పోలిరెడ్డి రవీందర్ మంగళవారం వసతులను పరిశీలించారు. భోజన వసతులు, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుధ్య చర్యలు కూరగాయల నాణ్యతతో పాటుగా రికార్డుల నిర్వహణను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ, సీనియర్ అసిస్టెంట్ భగత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంఎల్‌టీ గ్రూపులో చేరండి

కొడకండ్ల జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బాలో ఇంటర్ మొదటి సంవత్సరంలో కొత్తగా ప్రారంభించిన మెడికల్ లేబరేటరీ టెక్నాలజీ గ్రూపులో 16 సీట్లు మిగిలినట్లు స్పెషల్ ఆఫీసర్ జి.జ్యోతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ మిగిలిన 16సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగతల వారు ఈ గ్రూపులో చేరాలని, మిగతా వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా సీత్లా భవాని పండుగ

తరిగొప్పుల, జూలై 22(ఆంధ్రజ్యోతి): గిరిజనులు సీత్లా పండుగను మంగళవారం భోజ్యతండాలో ఘనంగా జరుపుకున్నారు. ఏడుగురు అమ్మవార్ల ప్రతిమలను మట్టితో ఏర్పాటు చేసి బోనం సమర్పించి సాంస్కృతిక నృత్యాలతో వేడుకలు చేశారు.

బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడిగా జయపాల్



తరిగొప్పుల, జూలై 22(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ తరిగొప్పుల గ్రామ యూత్ అధ్యక్షుడిగా చింతల జయపాల్‌ను ఏకగ్రీవంగా నియమిస్తున్నట్లు క్లస్టర్ ఇన్‌చార్జి ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పింగిలి జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంర్భంగా నూతన యూత్ అధ్యక్షుడు జయపాల్ మాట్లాడుతూ మండల కేంద్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కష్టపడి పనిచేస్తానన్నారు.

వర్షానికి కూలిన రేకుల ఇల్లు



స్టేషన్‌ఘన్‌పూర్, జూలై22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురిసిన వర్షంతో కోమటిగూడెంలో దైద నాగరాజుకు చెందిన రేకుల ఇల్లు మంగళవారంకూలిపోయింది. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని నాగరాజు వేడుకున్నాడు.

బీజేవైఎం మండలాధ్యక్షుడిగా సందీప్



లింగాలఘణపురం, జూలై22 (ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండల బీజేపీ అనుబంధ యువ మోర్చా మండల అధ్యక్షుడిగా వడ్డిచర్లకు చెందిన కేమిడి సందీప్‌ను నియమిస్తూ బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కొండబోయిన సంపత్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. సందీప్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

రక్తదానానికి ముందుకురావాలి

జనగామ రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): యువత రక్తదానానికి ముందుకు రావాలని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్‌రాజ్ కోరారు. జనగామ జిల్లాకు చెందిన గుగులోత్ కిరణ్ జన్మదినం సందర్భంగా కిరణ్ స్నేహితులు తేజావత్ మోహన్, గణేశ్‌లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో సుమన్, పండుగ నరేశ్, బొట్ల సాయి, నర్సింహులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయఢంకా మోగించాలి : బీజేపీ


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

జఫర్‌గడ్, జూలై 22(ఆంధ్రజ్యోతి):రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం జఫర్‌గడ్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం పార్టీ మండల ఇన్‌చార్జీ మారెపల్లి రవి అధ్యక్షతన జరిగింది. రమేశ్ మాట్లాడుతూ ప్రజలు బీజేపీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, ప్రధాని మోదీ దేశ ప్రగతికి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిషలు పాటుపడుతున్నారని గుర్తుచేశారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి వార్డు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులకు బీజేపీ పోటీ చేస్తుందన్నారు. కాగా, తొలిసారిగా మండల కేంద్రానికి విచ్చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడిని నాయకులు, కార్యకర్తలు శాలువాలతో సన్మానించారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, నేతలు నవీన్‌రెడ్డి, తౌటి సురేశ్ గౌడ్, మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, సంతోష్‌రెడ్డి, సారయ్య, ఎ.మదన్‌మోహన్, రామరాజు, సాయిరాం, రమేశ్, లింగన్న పాల్గొన్నారు.

స్త్రీనిధి.. అతివల పెన్నిధి

(5వ పేజీ తరువాయి)

రుణాలను పంపిణీ చేశారు. అయితే ఇప్పటి వరకు 30శాతం రుణాలు పంపిణీ చేయాల్సి ఉండగా 15శాతం మాత్రమే పంపిణీ జరగడం గమనార్హం. ఇందుకు జిల్లాలో పేరుకుపోయిన స్త్రీనిధి రుణ బకాయిలే కారణంగా తెలుస్తోంది. గత ఏడాది 2024-25లో రూ.40.75 కోట్ల రుణ పంపిణీ లక్ష్యంకాగా,లక్ష్యాన్ని అధిగమించి రూ.42.90 కోట్లను అంటే శత శతానికి పైగా రుణాలను మహిళలకు అందించడం విశేషం.

రూ.14.50కోట్ల బకాయిలు..

జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు రూ.14.50కోట్ల స్త్రీనిధి రుణ బకాయిలు ఉన్నాయి. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో జిల్లాలో అత్యధికంగా పాలకుర్తి మండలంలో రూ.2.50కోట్లు, జఫర్‌గడ్ మండలంలో రూ.90 లక్షలు బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. బకాయిలు పేరుకుపోవడంతో రుణాల పంపిణీలో వేగం తగ్గిందని, రుణాల రికవరీకి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వచ్చే ఏడాది జనవరి వరకు రుణ పంపిణీ లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు చేపట్టారు.

రుణాల పంపిణీ, నిధులపై సమీక్ష

కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధి కారులు, ఉద్యోగ సిబ్బందిచే తరచూ సమీక్షలు నిర్వహిస్తూ రుణాల పంపిణీ వేగవంతంపై దిశా నిర్దేశం చేస్తున్నారు. సంఘాలకు అందించిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు, సభ్యులు తీసుకున్న రుణం, తిరిగి చెల్లించిన రుణం, ఇంకా మిగిలిన అప్పు, జమ చేసిన పొదుపు, రాయితీలు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

లక్ష్య సాధనపై దృష్టి సారించాం

పాలాది నిర్మల, స్త్రీనిధి రీజినల్ మేనేజర్, జనగామ



జనవరి 2026 స్త్రీనిధి రుణాల లక్ష్య సాధన దిశగా కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం. సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి రుణాలు పొందేందుకు చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో పేరుకుపోయిన రూ.4.75 కోట్ల రుణ బకాయిలను రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టాం. రుణాల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు చోటు లేకుండా ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా ఉంటుంది. మహిళల ఉన్నతే లక్ష్యంగా పని చేస్తున్నాం. రుణాలు పొందిన సభ్యులు యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలి. సకాలంలో వాయిదాలు చెల్లించాలి. గత ఏడాది శత శాతంపైగా లక్ష్యం సాధించాం.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


కృష్ణకాంత్ (ఫైల్)

రఘునాథపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి పడిన ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఖిలాషాపూర్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. ఖిలాషాపూర్‌కు చెందిన పానుగంటి లక్ష్మణమూర్తి-కవిత దంపతుల కుమారుడు పానుగంటి కృష్ణకాంత్(24) 19న ఇంటి మూడో అంతస్తు నుంచి కిందికి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఇంటి పైనుంచి కింద పడగా, తలకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఆగస్టు ఒకటో తేదీ నుంచి కృష్ణకాంత్ ఉద్యోగంలో చేరాల్సి ఉండగా, ఇలా మృత్యువాతపడడం కలిచివేసింది. మృతదేహానికి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచార్యులు, మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు భిక్షపతి, వెంకటేశ్వర్లు, సత్యానారాయణ నివాళులర్పించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ పోలింగ్


ప్రమాణం చేస్తున్న విజేతలు

జఫర్‌గడ్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : తిమ్మంపేట జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికలపై మాక్ పోలింగ్ నిర్వహించారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికపై పాఠశాలలో విద్యార్థులచే నమూనా ఓటింగ్ ప్రక్రియ చేపట్టారు. బ్యాలట్ పేపర్లు, ఓటర్లు, పోటీ అభ్యర్థులు, ఓటింగ్, లెక్కింపు, ఫలితాల ప్రకటన వంటి అంశాలపై ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతి ద్వారా వివరించారు. ఎన్నికల నిర్వాహకులుగా ఉపాధ్యాయులు పిట్టల మహేందర్, నాగుల లక్ష్మీప్రసన్న వ్యవహరించారు. కార్యక్రమంలో హిమ్మత్‌నగర్ హెచ్‌ఎం మంగు జయప్రకాశ్, తిమ్మంపేట హెచ్‌ఎం డి.శరోన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



బచ్చన్నపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి):గవర్నర్ బిష్ణుదేవ్‌శర్మ చేతుల మీదుగా ఈనెల 7న పీహెచ్‌డీ పట్టా అందుకున్న కేశిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు మాలోతు రాజేశ్వరిని మంగళవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి సన్మానించారు. విద్యార్థులు ఉన్నతులుగా ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకుని, క్రమశిక్షణతో చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని హెచ్‌ఎం సుధాకర్ కోరారు. ట్రైబల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై కేయూ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


చిలుపూర్‌లో మొక్కలు నాటుతున్న ఈవో

చిలుపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని చిలుపూర్ ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న కోరారు. మంగళవారం బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో వన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీవో బర్మావత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్‌లతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సువర్ణ పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి పూజలు చేపట్టారు. కార్యక్రమంలో కుర్రెంల మోహన్, ధర్మకర్తలు రాజశేఖర్, రత్నాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, వీరన్న,మోహన్‌రావు పాల్గొన్నారు.

● పాలకుర్తి(ఆంధ్రజ్యోతి) : వనమహోత్సవాన్ని పండుగలా నిర్వహించాలని పాలకుర్తి ఏడీఏ పర్శరాం నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఏవో విజయసాయిరెడ్డి, ఏఈవోలు వెంకటేశ్, రాధిక, మహేశ్ ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రఘునాథపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేరుకు పోయిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, శాగ యాదగిరి, మైలారం వెంకటేశ్వర్లు, వంగాల ఎల్లేష్, కడారి ఐలయ్య, నర్సయ్య, మధుసూదన్ రెడ్డి, శాగ నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్ర పటానికి క్షీరాభిషేకం


ఎమ్మెల్యే పల్లా చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

తరిగొప్పుల, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో మండలానికి 62 ఇందిరమ్మ ఇళ్లను మంజూరి చేసినందుకుగాను బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ శ్రేణులు మండల కేంద్రంలో ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహిచారు. కార్యక్రమంలో మండల నాయకులు చిలువేరు లింగం, ఎడెల్లి శ్రీనివాస్ రెడ్డి, అంకం రాజారాం, తాళపల్లి రాజేశ్వర్ గౌడ్, పోషయ్య గౌడ్, మల్యాల సుధీర్, చింతల జయపాల్, ముద్దసాని వెంకట్ రెడ్డి, జుంలాల్ నాయక్ పాల్గొన్నారు.